కథ

# పసిడి జ్ఞాపకాలు

కదలడానికి సిద్ధంగా వున్న రేపల్లె బస్‌ని పరుగులాంటి నడకతో అందుకున్నాను. కిటికీ పక్క సీట్లో కూర్చుని, వెనక్కి ఆనుకుని కళ్ళు మూసుకున్నాను. మూసిన రెప్పల వెనుక సుళ్ళు తిరుగుతున్న కన్నీళ్ళు..గుండెలో ఉప్పొంగుతున్న ఉప్పెనలాంటి దుఃఖం.

కండక్టరు వచ్చి ''టికెట్'' అనడంతో ఉలిక్కిపడి కళ్ళు తుడుచుకున్నాను. ప్రతీసారి మా ఊరికి టికెట్ కొనేటప్పుడు ఎంత సంబరపడేదాన్నో..ఇప్పుడంత దుఃఖం! నిస్సత్తువగా కండక్టర్ ఇచ్చిన టికెట్, చిల్లర అందుకుంటూ బయటికి చూసాను. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. వెలుగురేకలు విచ్చుకోలేదు.

ఇంకో గంటలో ఊరు చేరుకుంటాను. అక్కడి దృశ్యం..తలచుకుంటేనే దుఃఖం ముంచుకొస్తోంది. కిటికీ వైపునకు పూర్తిగా తిరిగి, దుఃఖాన్ని ఆపుకొనేందుకు విశ్వప్రయత్నం చేసి విఫలమయ్యాను.

ఇదే రోడ్డులో..ఇదే బస్సులో..ఎన్నోసార్లు ప్రయాణం చేసాను. ప్రతీసారీ ఒక కొత్త ఆనందమే. సరికొత్త సంబరమే. ఇక ఆ ఆనందం లేదు, ముగిసిపోయిందంటే...ఎంత బాధ..ఎంత వేదన! భరించేదెలా?

బస్సుకంటే ముందుగా ఎప్పుడూ నా మనసే ఊర్వైపు పరుగులు తీసేది. ఇప్పుడు ఊళ్ళోకి అడుగుపెట్టడానికే భయంగా వుంది.

పూర్తిగా తెల్లవారింది. దారి పొడుగునా వరుసగా రీవిగా నుంచొని గాలికి తలలూగిస్తున్న తాటిచెట్లు, స్వచ్ఛమైన పైర గాలి, ఆకాశంలో అందంగా పల్టీలు కొడుతూ ఆనందంగా ఎగురుతున్న నీటి పక్షులు, పచ్చటి పొలాలు, పచ్చిక బయళ్ళు..ప్రతీసారి ఈ దృశ్యాన్ని ఎంతో పరవశంగా పరికించే నాకు..ఇప్పుడవేవి కనబడ్డం లేదు.

కనబడేది ఒకే రూపం..అంతటా అదే రూపం!

బస్సు బస్టాండులో ఆగీ ఆగగానే ఒక్క వుదుట్న దిగేసాను. కుడిచేత్తో సూట్‌కేస్ పట్టుకుని గబగబ ఇంటివైపు అడుగులు వేసాను. వేణుగోపాలస్వామి ఆలయం లోంచి వినిపిస్తున్న గంటలు ఏవో జ్ఞాపకాలని గుర్తుతెచ్చాయి. మళ్ళీ దుఃఖం వచ్చింది. నీరు నిండిన కళ్ళకి దారి సరిగ్గా కనబడ్డం లేదు. దారిపొడుగునా ఎవరెవరో పలకరిస్తున్నారు. సమాధానం చెప్పే స్థితిలో లేను.

వీధి మలుపు తిరగ్గానే ఇంటి ముందంతా జనం. నన్ను చూడగానే పక్కకి జరిగి దారి ఇచ్చారు. ఎదురుగా హాలు మధ్యలో పడుకొని వుంది అమ్మమ్మ! ప్రశాంతంగా నిద్రపోతున్నట్టే వుంది. నిశ్చేష్టనై అలా చూస్తూ వుండిపోయాను. ఎప్పుడు నేను ఇంటికొచ్చినా ఆప్యాయంగా దగ్గరికి తీసుకునే అమ్మమ్మ. ఇప్పుడు చూడదేం. మాట్లాడదేం? మెల్లగా వెళ్లి పక్కనే కూర్చున్నాను. అమ్మమ్మ చేతిమీద చేయి వేసాను.

''అమ్మమ్మా! నేనొచ్చాను. ఒక్కసారి చూడవూ?'' అన్నాను గొంతు పెగుల్చుకొని.

''ఇంకెక్కడి అమ్మమ్మే తల్లీ! మనల్ని అన్యాయ చేసి వెళ్ళిపోయింది..'' పెద్ద పిన్ని నన్ను పట్టుకుని బావురుమంది. అక్కడున్నవాళ్ళంత శ్రుతికలిపారు. ఒక్కసారిగా ఏడుపులతో ఇల్లంతా దద్దరిల్లిపోయింది.

నేను మోకాళ్ళలో తల దూర్చేసి కూర్చున్నాను. ఎన్నెన్నో జ్ఞాపకాలు కళ్ళముందే కదలుతున్నాయి. నా చిన్నతనమంతా అమ్మమ్మ ఒడిలోనే గడచింది. అంత మంచి మనిషిని, స్వార్థమంటూ లేని మనసుని..నేను నా జీవితంలో ఇంతవరకూ చూడలేదు. కూతుళ్ళని, కోడళ్ళని సమానంగా చూడగలిగిన ఔన్నత్యం, మనవళ్ళనీ..మనవరాళ్ళనీ ఆప్యాయంగా సమదృష్టితో చూడగల ఔదార్యం..నిజంగా నేను ఎక్కడా..ఎవరిలోనూ చూడలేదు.

''రాత్రి ఫోన్లో నువ్వు చెబుతుంటే నమ్మలేకపోయాను పిన్నీ'' ఏడ్చేసాను.

> జామచెట్టు కింది సిమెంటు చప్టా మీద కూర్చున్నాను. ఇక్కడ కూర్చుని అమ్మమ్మ మాకు పూలజడలు వేసేది. గోరింటాకు పెట్టేది. ఆకాశంలో చందమామని చూపిస్తూ గోరుముద్దలు తినిపించేది. కథలు చెప్పేది. ఈ గాలిలో ఈ ధూళిలో..ఇక్కడ రాత్రింపగళ్ళు తిరిగిన సంఘటనలు..వేసిన గాఢముద్రలు కాలానికి ఎదురీది మళ్ళీ ఆ అనుభవాల సాంద్రతను పునరనుభూతం చేస్తున్నాయి. చిరుగాలికి నేల రాలుతున్న రాధామనోహర చెట్ల ఆకుల అంచుల్లో పాత అనుభవాల స్పర్శ మృదువుగా సోకుతోంది!

''ఊరుకోమ్మా..ఏం చేస్తాం? పండిన పండు ఎప్పటికైనా రాలాల్సిందే కదా..'' ఓదారుస్తూ అంది చిన్నత్త!

''పిల్లల్ని తీసుకురాకుండా వచ్చావేంటి శ్రావణీ..'' అడిగింది పెద్దత్త!

''పిల్లలకి ఎగ్జామ్స్ అత్తా..అందుకే ఒక్కదాన్ని వచ్చాను..'' ఏడుపు దిగమింగుతూ చెప్పాను.

అమ్మమ్మ చివరి ప్రయాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

''త్వరగా కానివ్వండి. ఎండెక్కుతోంది..'' అంటున్నారు ఎవరో.

అమ్మమ్మని హాల్లోంచి బయటికి తీసుకెళ్ళారు. తర్వాత జరగాల్సినవన్నీ చకచకా జరిగిపోతున్నాయి. కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాను. తిరిగిరాని లోకానికి, మరలిరాని ప్రయాణానికి సిద్ధమై..నా కళ్ళముందే అమ్మమ్మ వెళ్ళిపోతోంది.

''వెళ్ళి..పో..యిం..ది!''

ఇక రాదా! తిరిగి కనపడదా?

నిస్సత్తువగా వెనక్కి తిరిగి హాల్లోకి వచ్చాను. అమ్మమ్మ లేని ఇల్లు బోసిగా కనబడింది. ఏదో వెలితిగా తోచింది.

కళ్ళ వెంట కారుతున్న నీటికి ఆనకట్ట వేయడం..ఎవరి తరం?

★★★

పడమటి దిక్కున ఆకాశం సిందూర వర్ణంలో ఎరుపెక్కింది. ఏడ్చి ఏడ్చి ఎర్రపడ్డ నా కళ్ళలోకి ఆ ఎరుపు వర్ణం పరావర్తనం చెందుతోంది. ఎంత ఏడ్చి ఏం లాభం? వెళ్ళిపోయిన అమ్మమ్మ ఇక రాదు! ఎలా ఈ నిజాన్ని జీర్ణించుకోడం?


ఎవరితోనూ మాట్లాడాలనిపించక..ఒంటరిగా అమ్మమ్మ గదిలో కూర్చున్నాను. కిటికీలోంచి పెరడంతా కనబడుతోంది. అందరూ స్నానాలు చేసి..పెరట్లో చేరి కబుర్లలో పడి మునిగిపోవడం..మధ్య మధ్య నవ్వుకోడం..స్పష్టంగా కనబడుతోంది.

ఒక మనిషి మరణాన్ని ఇంత తేలిగ్గా ఎలా తీసుకోగలరు? నాకు అర్థం కాలేదు.

అసలేం జరగనట్టు..పెళ్ళిలో పేరంటంలో కలుసుకున్నట్టు కబుర్లు చెప్పుకుంటున్నారు. ఒకళ్ళ సంగతలు ఒకళ్ళు తెలుసుకుంటున్నారు.

''ఒక్కదానివి కూర్చున్నావేమిటే శ్రావణీ..రా పెరట్లోకి వెళ్దాం..'' అంటూ లోపలికి వచ్చింది పెద్ద పిన్ని పెద్దకూతురు నళిని!

నా చెయ్యి పట్టుకుని బలవంతంగా పెరట్లోకి లాక్కెళ్ళింది. మామిడి చెట్టు కింద వంటలు మొదలుపెట్టినట్టున్నారు. గాడిపొయ్యి వెలుగుతోంది. నళిని చెయ్యి వదిలించుకుని...పక్కగా వున్న జామచెట్టు కింది సిమెంటు చప్టా మీద కూర్చున్నాను. ఇక్కడ కూర్చుని అమ్మమ్మ మాకు పూలజడలు వేసేది. గోరింటాకు పెట్టేది. ఆకాశంలో చందమామని చూపిస్తూ గోరుముద్దలు తినిపించేది. కథలు చెప్పేది. ఈ గాలిలో ఈ ధూళిలో..ఇక్కడ రాత్రింపగళ్ళు తిరిగిన సంఘటనలు..వేసిన గాఢముద్రలు కాలానికి ఎదురీది మళ్ళీ ఆ



అనుభవాల సాంద్రతను పునరనుభూతం చేస్తున్నాయి. చిరుగాలికి నేల రాలుతున్న రాధామనోహర చెట్ల ఆకుల అంచుల్లో పాత అనుభవాల స్పర్శ మృదువుగా సోకుతోంది!

కాలు గాలిన పిల్లిలా ఇల్లు, వసారా, పెరడు అంతా తిరుగుతున్నాను.

అంతటా అమ్మమ్మ జ్ఞాపకాలే!

★★★

రాత్రి భోజనాలు అయాయి. పిల్లలు నిద్రపోయారు.

పెద్దలంతా పెరట్లో చేరారు. పక్కలు పరుచుకుని కూర్చున్నారు. పలకరింపులు..కులాసా కబుర్లు!

నాకెందుకో బాధనిపించింది. అసహ్యంగా కూడా అనిపించింది. అమ్మమ్మలాంటి మంచి మనిషి మరణం వాళ్ళకేవీ వెలితిగా అనిపించడం లేదా! ఎంత బాగా చూసింది

[illegible] అందర్నీ! అప్పుడే ఎలా మరిచిపోయారు?

"శ్రావణీ! మీ అయన రాలేదేవిటే?" అడిగాడు చిన్న మామయ్య.

[illegible] చూసుకోవాలి కదా- అందుకే వుండిపో[illegible] ముభావంగా చెప్పాను.

"అమ్మమ్మ లేదుకదా..ఇక ఈ ఊరి ముఖం చూడవేమో" నవ్వుతూ అంది పిన్ని.

ఆ నవ్వు చూస్తే నాకు కంపరమెత్తింది. జవాబు చెప్పకుండా మొహం పక్కకి తిప్పుకున్నాను.

"అమ్మ వడ్డాణం, కాసులపేరు నేను తీసుకుంటాను.." సడన్‌గా అంది చిన్న పిన్ని.

"నీకెందుకే అవీ. నీకు ఆడపిల్లలు లేరుగా. నాకంతా ఆడ సంతానమేనాయే.. అమ్మ బంగారమంతా నేను తీసుకుంటాను.." అంది పెద్ద పిన్ని.

"ఆడపిల్లలు లేకపోతేనేం..నేనే పెట్టుకుంటాను.." సాగదీస్తూ అంది చిన్న పిన్ని.

పెద్ద పిన్ని మూతి మూడు వంకర్లు తిప్పుకుంది.

"అద్దం వున్న రోజ్‌వుడ్ బీరువా నేను తీసుకెళ్తాను" పెద్దత్త అందుకుంది.

"ఎన్ని బీరువాలు తీసుకెళ్తావు? అమధ్య ఇనుప బీరువా తీసుకెళ్ళావు. ఇది నాకే కావాలి" చిన్నత్త గయ్యిమంది.

"నాకిద్దరూ ఆడ పిల్లలనే కదా..రేపు..సారె ఇవ్వడానికి పనికి వస్తుందని గానీ..నాకేం ఆశలేదులే అన్నీ నాకే కావాలని.." అంది పెద్దత్త.

"సరే..ఆ పందిరి మంచం తీసుకుంటాను.." ఒక్కక్షణం ఆగి మళ్ళీ పెద్దత్తే అంది.

"ఆ పందిరి మంచం నాకివ్వమని అత్తయ్యని నేనెప్పుడో అడిగాను.." అంది ముందు జాగ్రత్త ఎక్కువున్న చిన్నత్త.

"ముందే రిజర్వు చేసుకునే తెలివితేటలు నాకూ, మా ఆయనకీ లేవులేమ్మా" చేతులు తిప్పుతూ అంది పెద్దత్త.

నాకు చాలా అసహనంగా వుంది. ముళ్ళమీద కూర్చున్నట్టుగా వుంది. మావయ్యలైతే మరీ అన్యాయంగా ఇంటి అమ్మకం గురించి కూడా ఆలోచిస్తున్నారు.

విశారద

''మంచి బేరం వస్తే చెప్పమని మునసబుకి చెప్పివచ్చాను'' అంటున్నాడు మోహన్ మామయ్య.

''పొలం కూడా ఎందుకిక్కడ? ఎవరు చూస్తారు. అది కూడా అమ్మేద్దాం'' వంతపాడాడు జగన్ మామయ్య.

ఇక నేనక్కడ కూర్చోలేక లేచాను!

''ఎక్కడికే శ్రావణీ?'' అడిగింది పిన్ని.

నేను విననట్టుగా అక్కడినుండీ వచ్చేసాను. మనుషుల మధ్య అతి సహజంగా వుండవలసిన ఆర్ద్రత, ఆత్మీయత లేనప్పుడు మాటలు..చివరికి పలకరింపులు కూడా వట్టి లాంఛనాలుగానే మిగిలిపోయాయి. అమ్మమ్మని కాటికి పంపించి ఒక్కరోజన్నా గడవలేదు అప్పుడే ఆస్తులు..అమ్మకాలు..పంచుకోవడాలు...ఛీ..ఛీ..ఏం మనుషులు?

హాల్లోకి వచ్చాను. పిల్లలు, పెద్దలు అడ్డదిడ్డంగా పడి నిద్రపోతున్నారు. హాల్లోంచి లోపలికి వెళ్లాను. దేవుడి గది, వంట గది, పడక గది, మండువా..అన్ని గదుల్లో కాస్సేపు అటూ ఇటూ తిరిగాను. అంతటా అమ్మమ్మ జ్ఞాపకాలే!

నేను ముగ్గులేసి గొబ్బెమ్మలు పెట్టిన వాకిలి, బొమ్మల పెళ్ళిళ్ళు చేసిన పసారా, అట్లతద్దికి ఉయ్యాలలూగిన పెరడు, అమ్మమ్మ ఒళ్ళో కూర్చుని అక్షరాలు దిద్దిన హాలు, నేను పుట్టిన మండువా గది, నా పసితనమంతా అమ్మమ్మ ఒడిలోనే అపురూపంగా గడిచింది.

ఒక గదిలోంచి ఒక గదిలో అలా తిరుగుతుంటే..అమ్మకోసం వెతుక్కుంటున్న పసిపిల్లలా వుంది నా మనస్థితి!

వంటింటి వైపుకొచ్చిన నేను హఠాత్తుగా ఆగిపోయాను. దాని పక్కనే ఒక గది వుంది. అది ఒకప్పుడు వంట గదట! వాస్తు బాగాలేదని, దాని పక్కనే మరో వంట గది కట్టాక ఆ గది అలా మిగిలిపోయింది. దాంతో మా అల్లరి పన్లకి ఆ గదినే స్థావరంగా చేసుకున్నాం. పిల్లలందరం ఆ గదిలో చేరి తలుపులు బిగించుకుని ఎన్నెన్నో ఆటలు ఆడేవాళ్ళం. విరిగిపోయి, కన్నాలు పడిన చెక్క బీరువా ఒకటి ఆ గదిలో వుండేది. దాన్లో నానాచెత్త చేర్చేవాళ్ళం. ఆ బీరువా గుర్తొచ్చి గబగబా అటువైపు నడిచాను. గది తలుపులు తెరిచి, లైటు వేసాను. ఒక్కసారిగా నా బాల్యమంతా కళ్లముందు పరచుకున్నట్టయింది. చాలా ఏళ్ల తర్వాత ఆ గదిలోకి అడుగుపెట్టాను. బీరువా తెరిచాను. అందులో మేం చిన్నప్పుడు ఆడుకున్న ఆటసామానంతా భద్రంగా అలాగే వుంది. అమ్మమ్మ అలాగే వుంచింది. పారెయ్యాబుద్ధికాలేదు కాబోలు.

కొండపల్లి బొమ్మలు, లక్కపిడతలు, బొమ్మల పెళ్లిళ్లు చేసిన చెక్క బొమ్మలు, అమ్మమ్మ పూజగదిలోని ఏనుగు బొమ్మ (పాపం అమ్మమ్మ దీనికోసం మమ్మల్ని చాలాసార్లు అడిగింది), మగవేషం, ఆడవేషం వేసిన తాటాకు బొమ్మలు, గుడ్డపీలికలు, పూసల దండలు, అచ్చంగాయలు, చింత పిక్కలు, ఈత గింజలు...

ఒకానొక అద్భుత ప్రపంచం నా కళ్లముందు సాక్షాత్కరించింది. ఒకానొక దివ్యానందం ఒక్కసారిగా నన్నావరించింది. నా చిన్నతనమంతా నా చుట్టూ ఆర్ద్రంగా పరచుకుంది. ఎన్నో జ్ఞాపకాలు...సినిమారీళ్లలా కళ్లముందే గిర్రున తిరుగుతున్నాయి.

వేసవి మిట్టమధ్యాహ్నం, అమ్మమ్మ మమ్మల్ని బయటికి వెళ్లనీయకుండా, వీధి తలుపులు వేసేసి- ఇంట్లో బంధించినపుడు...ఈ గదిలో చేరి రకరకాల ఆటలు ఆడేవాళ్లం. గదంతా చీకటి చేసి, గోడమీద సినిమా స్లైడులు వేయడం, అమ్మమ్మ చీరలు చూడకుండా తెచ్చేసి కట్టుకుని, పౌడరు రాసుకుని, పెద్ద బొట్టు పెట్టుకొని బొమ్మల పెళ్లిళ్లు చేయడం, ఒక్కోసారి నిజం వంటలు...ఒక్కోసారి ఉత్తిత్తి వంటలు, అగ్గిపెట్టె ఫోన్లలో కబుర్లు...ఎంత అల్లరి చేసినా అమ్మమ్మ ఏవీ అనేది కాదు. పైగా మా బొమ్మల పెళ్లిళ్ల ఆటకి బెల్లం ముక్క, అటుకులు, సున్నుండలు ఇచ్చేది. మా ఆటల్ని నవ్వుతూ చూసేది. ఎప్పుడూ ఎవర్నీ కోప్పడి ఎరగదు.

అలాంటి మనిషి మరణాన్ని వీళ్లంతా ఇంత తేలిగ్గా ఎలా తీసుకున్నారు? ఒక్కరోజన్నా గడవందే ఎలా మరచిపోయారు? మనుషుల్లో ఇంత స్వార్థమా? ఇంత సంకుచిత్వమా?

ఆ వస్తువుల్ని చూస్తున్నకొద్దీ ఆనందమో...దుఃఖమో...ఏదో సరిగా చెప్పలేను కానీ...కళ్లు నీటి చెలమలయ్యాయి. ఆ ఆట వస్తువులని అపురూపంగా అలా చూస్తూ వుండిపోయాను. ఎంత సమయం గడిచిందో తెలీదు.

కాస్సేపటికి ఏదో స్ఫురించినట్టయి...గబగబా ఆ గదిలోంచి బయటికి వచ్చి బెడ్రూమ్‌లో వున్న నా సూట్‌కేస్ తీసుకుని, తిరిగి ఆ గదిలోకి వచ్చాను. ఆ విరిగిపోయిన బొమ్మలు, పట్టుగుడ్డపీలికలు, లక్కపిడతలు...అన్ని ఒక్కొక్కటీ బీరువాలోంచి తీసి నా సూట్‌కేస్‌లో సర్దుకోసాగాను.

''శ్రావణీ! ఏం చేస్తున్నావిక్కడ? నీకోసం ఇల్లంతా వెతుక్కుంటున్నాం..''

వెనక్కి తిరిగి చూసాను. పెద్ద పిన్ని, కూతుళ్లిద్దరూ నిలబడి నా చర్యలను ఆశ్చర్యంగా చూస్తున్నారు.

నేనేం మాట్లాడలేదు.

''ఓసి పిచ్చిమొకమా! ఆ పనికిరాని సామానెందుకే నీకు? నువ్వు చిన్నప్పుడు పాలు తాగిన వెండిగ్లాసు తీసుకెళ్లు. లేకపోతే దాన్ని కాస్తా మీ పిన్నమ్మ కైంకర్యం చేయగలదు...'' అంది నా పక్కనే వచ్చి నిలుచుని!

''అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు...సలహాలు బాగానే ఇస్తున్నావే...'' అప్పుడే అటుగా వచ్చిన చిన్నత్త దీర్ఘాలు తీస్తూ అంది.

''ఇప్పుడు నేనేం దానం చేసాను నీ సొమ్ము...'' పిన్ని వాదానికి దిగింది. మౌనంగా అక్కడనుండీ వచ్చేసాను. వాళ్లిద్దరి గొడవా ఇంకా వినబడుతూనే వుంది.

ఇక ఈ ఊరితో, ఈ ఇంటితో రుణం తీరిపోయిందంటే దుఃఖం వెల్లువౌతోంది. మనిషి కాదు వీళ్లకి కావాల్సింది. ఎంతసేపటికీ ఆ మనిషి మిగిల్చిపోయిన ఆస్తులు కావాలి.

ఆర్ద్రత, కృతజ్ఞత వున్న మనిషి జ్ఞాపకం పేరిట ఓ దీపాన్ని వెలిగిస్తాడే తప్ప, ఇలా మనసునీ, మమతనీ చంపేసుకొని రాక్షసుడవడు. గుండెలో ఆర్ద్రత వున్ననాడు జ్ఞాపకమూ ఒక దీపమై వెలుగుతుంది. జీవితానికో వెలుగునీ, ప్రేరణనీ ఇస్తుంది. ఈ నిజాన్ని తెలుసుకోరెందుకూ ఈ పిచ్చివాళ్లు! ఎంతసేపటికీ ఆస్తులేనా? మమతలూ, మమకారాలూ అవసరంలేదా?

ఆలోచనల మధ్య...ఆవేదన మధ్య తెల్లవారింది! గబగబా స్నానం చేసి ఏడు గంటలయ్యేటప్పటికి ప్రయాణానికి సిద్ధపడ్డాను.

''శ్రావణీ! ఆదేమిటి?...అప్పుడే వెళ్లిపోతున్నావ్?'' మామయ్య అడిగాడు.

''పిల్లలకి ఎగ్జామ్స్ మావయ్యా...వెళ్లాలి. తప్పదు'' అన్నాను నిర్లిప్తంగా.

''సరే...దినానికి మీ ఆయన పిల్లలతో రెండ్రోజులు ముందుగా రావాలి'' అన్నాడు.

''ఎందుకు? మీ తగవులు, కీచులాటలు వినడానికా?'' అనుకున్నాను. పైకిమాత్రం మౌనంగా తలూపాను. నాకు తిరిగి వచ్చే ఉద్దేశ్యం లేదు. వచ్చి వీళ్ల తగవుల్ని చూడలేను. నాక్కావాల్సిన అమ్మమ్మ జ్ఞాపకాల్ని అపురూపంగా నావెంట తీసుకెళ్తున్నాను. అంతే అపురూపంగా నా పిల్లలకి చూపిస్తాను. మనిషికి వుండవలసినదేమిటో...ఎందుకుండాలో చెబుతాను. మనిషి ఎందుకు బ్రతకాలో...దేనికోసం బ్రతకాలో వివరిస్తాను! నా పిల్లలు ఆర్ద్రతకి ఆనవాళ్లు కావాలే తప్ప...స్వార్థానికి ప్రతిరూపాలు కాకూడదు. కానివ్వను! పిన్ని అన్నట్టు నా సూట్‌కేస్‌లో వున్నవి పనికిరాని పాత సామానా? ఉహూ...కాదు! ఎంత కష్టంలో వున్నా, ఎన్ని ఇబ్బందుల్లో వున్నా...మరొకసారి స్ఫురణకి తెచ్చుకుంటే కొత్త కొత్త అనుభూతుల్ని, జీవితం పట్ల ఆశల్ని పెంచే పసిడి జ్ఞాపకాలు ఇవి! తీపి గుర్తులు ఇవి!

సూట్‌కేస్‌ని అపురూపంగా పట్టుకుని ఆ ఇంటి గడప దాటాను! ★

